'ఆంధ్రభూమి' దినపత్రిక - 13.6.1986

# స్పెషలిస్ట్

మా కంపెనీలో డిస్పెన్సరీ ఉంది. దాని నిండా రోగులకు సరిపడా డాక్టర్లు ఉన్నారు. లేనిది స్పెషలిస్టు!

మా డాక్టర్లకి అంతుబట్టిన మా రోగాల సంగతేవిటో తెల్సుకు రమ్మని అపుడపుడు స్పెషలిస్టులకు రిఫర్ చేస్తుంటారు.

స్పెషలిస్టుల ఫీజు పాతిక రూపాయలు. ఆ పాతిక ముందుగా మా జేబులోంచి పెట్టాలన్న మాటే గాని తర్వాత రశీదు ప్రొడ్యూస్ చేయగా - ఆ డబ్బు ఇచ్చేస్తుంది మాకు మా కంపెనీ.

అది కథ కాదు. పద్ధతి.

కథ నాతో మొదలయింది.

మా డాక్టర్లు రెండు నెలలు నన్ను శుభ్రంగా గెలికేసి - రోగ నిర్ధారణ చేయలేక నన్ను స్పెషలిస్టు దగ్గరకు పొమ్మన్నారు.

పోయేను. బుద్ధిగా పోయేను. భయంగా పోయేను.

స్పెషలిస్టుకి నా రోగం చెప్పేను.

అంతకుముందు నేను తీసుకున్న ట్రీట్‌మెంట్ వివరాలు చూపేను. నాతో తీసుకొచ్చిన ఎక్సరేలు చూపేను. బ్లడ్, యూరిన్, మోషన్ టెస్టు రిపోర్టులు చూపేను.

వారు ఏదీ చూడలేదు!

చూడకుండా - ఆ ఎక్సరేలు, ఆ టెస్టులూ మళ్ళీ చేయించుకు రమ్మన్నారు. చేయించుకురమ్మన్నది నా ఇష్టమైన చోట కాదు - అతను చెప్పిన చోట మాత్రమే. అక్కడే ఎందుకంటే అదంతే! అక్కడ నుంచి తేకుంటే అది ఎక్సరే కాదు, అక్కడ టెస్టు చేసుకోకుంటే అవి టెస్టులు కావు. అదంతే!

కథ అంతటితో ముగిస్తే చాలా బాగుండేది.

నా కోసం విలువైన టైము వెచ్చించిన ఆ వైద్య మేధావికి నేను న్యాయంగా ఫీజు చెల్లించడం నా ధర్మం!

ఫీజు పాతిక.

నా జేబులో ఉన్నది యాభై నోటు. చిల్లర లేదు.

స్పెషలిస్టు దగ్గర లేకుండా ఉండదు.

వారు యాభై నోటు తీసుకుని పాతిక రూపాయల రశీదు ఇచ్చారు.

మిగతా పాతిక రూపాయలు ఇవ్వలేదు.

వారి దగ్గర కూడా చిల్లర లేదా? లేక మరిచిపోయారా?

అంత సొమ్ము నేను మరిచిపోలేనుగదా? వారికి గుర్తు చేశాను.

గుర్తు చేయగానే 'అరె, సారీ' అనలేదు, 'అరెరె! మర్చిపోయాను' అంటూ నాలిక కొరుక్కోలేదు.

"సరిపోయింది" అన్నారు.

సరిపోవడం ఏమిటి?

నా ఒళ్ళు చల్లబడిపోయింది.

"నీవు యాభై నోటు ఇచ్చావా - నీవు నాకు ఫీజుగా ఇచ్చేది, నాకు దక్కేదీ పాతికే"

"అదెలా?"

అదంతే!

"నీ విచ్చిన యాభైలో ఒక పాతిక మీ కంపెనీ ఇచ్చేస్తుంది గనుక - నీవు నిజంగా చెల్లించిన ఫీజు పాతిక మాత్రమే. అలాగే నీవు ఇచ్చిన యాభైలో పాతిక రూపాయలకి బిల్లు ఇచ్చేను. అది ఇంచుమించు ఇన్‌కమ్‌టాక్స్‌కి పోతుంది. నిజానికి ఫీజు నేను పాతిక మాత్రమే తీసుకున్నట్టు - నీవు అంతే చెల్లించినట్టు. అండర్‌స్టాండ్!"

'అమ్మ నా కొడకా!' అని నిలువు గుడ్లేసుకుని బయటకొచ్చేసాను గాని - వాడి దవడ పళ్ళు రాలగొట్టి, అవి వాడి చేతిలో పెట్టి నా డబ్బులు నేను లాగేసుకొని 'అండర్‌స్టాండ్' అన్న రిప్లయితో కథ ముగిస్తే బాగుండేదని ఇప్పటికీ అనుకుంటాను.